క్లుప్తంగా

పైప్‌లైన్ లీకేజీ



రోడ్డుపైకి చేరిన నీరు

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో తాగునీరు వృథా అవుతున్నట్లు సీపీఐ నాయకుడు ముత్యాలు తెలిపారు. స్థానిక దళితవాడ ప్రజల సౌకర్యార్థం బోరు వేయించినట్లు పేర్కొన్నారు. తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని తెలిపారు.

ఉచిత గర్భకోశ చికిత్సలు

కదిరి అర్బన్: యర్రదొడ్డి గ్రామంలో సోమవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, వెటర్నరీ డాక్టర్ సునీత హాజరయ్యారు. 34 పశువులకు గర్భకోశపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

వారపు సంతతో ఇక్కట్లు



రోడుపైనే నిర్వహిస్తున్న వారపుసంత

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో సోమవారం రోడ్డుపైనే వారపు సంత నిర్వహించారు. ఈ మార్గంలో భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, ఆటో తదితర వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ కూరగాయల వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గత కొన్నేళ్లుగా ఇలాగే సంత నిర్వహిస్తున్నారు. సంత ప్రదేశం మరొకచోటుకు మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని సర్వే నంబర్ 288-1ఈ, 24-1సీలో అక్కమ్మ, గంగన్న సాగు చేసిన కంది పంటలో సోమవారం మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పర్యవేక్షణలో వీహెచ్ఏ హరిప్రియ ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీమా కంపెనీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎర్రిస్వామి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, రైతులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయండి

ప్రశాంతి నిలయం: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలా జ్యోతిని సస్పెండ్ చేయాలని పీఎస్‌యూ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖలో ఉద్యోగుల బదిలీకి భారీగా డబ్బు వసూలు చేశారని, తనకు సహకరించని వార్డెన్లకు అకారణంగా మెమోలు ఇవ్వడం, చర్యలు తీసుకోకుండా డబ్బు దండుకోవడం చేస్తున్నారని డీడీపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు.

ఓటరు తుది జాబితా విడుదల



ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఆర్డీఓ

కదిరి అర్బన్: ఓటరు సంక్షిప్త సవరణలో భాగంగా కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 2025 ఓటర్ల తుదిజాబితా ప్రచురణను ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ సోమవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరప్రసాద్‌తో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'లయోలా' విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం అర్బన్: జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో లయోలా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ శంకర్‌నాయుడు తెలిపారు. పాఠశాలలో సోమవారం ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి విశ్వం ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ వేదిక్ మ్యాథ్స్‌లో లయోలా పాఠశాల విద్యార్థులు మధుసూదన్ మొదటి బహుమతి, భవాని ద్వితీయ బహుమతి సాధించారన్నారు. అబాకస్ విజువలైజేషన్ కాంపిటీషన్‌లో రితికరెడ్డి మొదటి బహుమతి సాధించినట్లు వెల్లడించారు.

రిటైర్డు ఉద్యోగులకు విశేష సేవలు

ధర్మవరం అర్బన్: విశ్రాంత ఉద్యోగులకు స్టేట్ బ్యాంకులో విశేష సేవలందిస్తున్నామని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శశిధర్ కుమార్ తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర డైరీలను రీజనల్ మేనేజర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి నర్సిరెడ్డి, గౌరవాధ్యక్షుడు రామయ్య, కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కులు తెచ్చే చేతిరాత



- అక్షరం మనసుకు హత్తుకోవాలి
- అందమైన చేతిరాతకు ముచ్చటైన మార్కులు

ఎన్పీకుంట: అక్షరాలకు ఓ ప్రత్యేకత ఉంది. పరీక్షల్లో మార్కులు సాధించాలంటే దస్తూరి (చేతిరాత) కీలకం. సమాధానపత్రం మూల్యాంకనం చేసేవారి మనసును హత్తుకునేలా రాత ఉండి, జవాబు కరెక్టుగా రాస్తే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే ఉంది. పరీక్ష సమయంలో సహజంగా హడావుడి, ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు అక్షరాలు చక్కగా రాసి, వేగం పెంచిన తర్వాత అదే తరహా కొనసాగించలేకపోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగానే చేతిరాత సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవు. కదిరి నియోజకవర్గంలోని ఎన్పీకుంట, గాండ్లపెంట, తనకల్లు, నల్లచెరువు, తలుపుల, కదిరి మండలాల్లో 33 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, తొమ్మిది జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 3,492 మంది విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ చదువుతున్నారు. ఇప్పటికే సిలబస్ అంతా పూర్తికాగా.. ప్రత్యేక తరగతుల ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. సబ్జెక్టులలో ప్రశ్నలకు జవాబులు బట్టీ పట్టడం, రాయడమే కాదు చేతిరాత కూడా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాథమిక తరగతుల దశ నుంచి చక్కటి చేతిరాతను సాధన చేయడం ఒక మార్గమైతే.. ఇంటర్, డిగ్రీ చదివే సమయంలో కూడా ప్రత్యేక సమయం కేటాయించి సాధన చేస్తే మంచి చేతిరాత సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా సెలవుల్లో సాధనకు ఎక్కువ సమయం కేటాయించడం ద్వారా కూడా చక్కటి చేతిరాతను పెంపొందించుకోవచ్చు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఇలా రాస్తే మంచి ఫలితాలు..



- జవాబుపత్రం పై భాగంలో అంగులం స్థలం వదలాలి. ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచి పెట్టాలి. కుడివైపు అర అంగులం ఖాళీ విడిచి రాయాలి.
- తెల్లకాగితంపైనే సమాధానాలు రాయడం సాధన చేయాలి.
- పరీక్షలకు అంత వరకూ ఉపయోగించని కొత్తపెన్నులు తీసుకువెళ్లకపోవడమే మంచిది. తీరా పరీక్ష సమయంలో అది సక్రమంగా రాయకపోవచ్చు. కొందరు విద్యార్థులు జెల్ పెన్నులు ఉపయోగిస్తుంటారు. వాటితో ఇబ్బందులు తప్పవు. రెండు బాల్‌పెన్నులు తీసుకెళ్లాలి.
- గణితానికి సంబంధించి అంకెలు సక్రమంగా రాయాలి.
- వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి.
- జవాబు మొదలు పెట్టిన స్థలం నుంచి చివరి వరకు సమాంతరంగా రాయాలి. పైకో.. కిందికో వెళ్లకూడదు. ఒక వరుసను అలా రాస్తే మిగిలిన వరుసలు కూడా అలాగే వస్తాయి. జవాబు పత్రం ఆకర్షణగా కనిపిస్తుంది.
- పదం, పదం మధ్యలో తగిన నిడివి పాటించాలి.
- చాలామంది విద్యార్థులు జవాబుపత్రాన్ని బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు. పెన్నును గట్టిగా బిగబట్టి రాస్తుంటారు. దానితో జవాబు పత్రం ఆకర్షణగా కనిపించదు. అంతేకాక కొద్దిసేపు రాయగానే వేళ్లు నొప్పులు పుడతాయి. అలా కాకుండా పెన్నును తేలికగా పట్టుకుని సాధారణంగా రాయాలి. విద్యార్థులు ఈ ప్రాథమిక సూచనలు పాటించడం ద్వారా మంచి మార్కులు పొందాలి.

ఆందోళన వద్దు



విద్యార్థులు ఆందోళన కారణంగా పరీక్షల సమయంలో అక్షరాలు సరిగా రాయలేరు. పరీక్షల సమయంలో విశ్రాంతి తీసుకోకుండా చదువుతుంటారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే వరకు కొందరు చదువుతూనే ఉంటారు. ఇది మంచి విధానం కాదు. ఇలా చేయడం వలన గాబరాపడి సమాధానాలు సరిగా రాయలేని పరిస్థితి ఏర్పడుతుంది. విశ్రాంతి లేకపోవడం వలన అలసటకు దారితీసి చేతిరాతపై ప్రభావం పడుతుంది.

– గోపాల్‌నాయక్, ఎంఈఓ, ఎన్పీకుంట

మార్కులకు మూలం చేతిరాతే



మంచి మార్కుల సాధనకు చేతిరాత చాలా ముఖ్యం. చేతిరాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయొచ్చు. పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు కూర్చునే విధానం సరిగా చూసుకోవాలి. ప్రతి విద్యార్థీ చేతిరాతలో ప్రాథమిక సూత్రాలు పాటించాలి. విద్యార్థుల చేతిరాతే భవిష్యత్‌లో ప్రభావం చూపుతుంది. మూల్యాంకనం చేసేటప్పుడు విద్యార్థుల చేతిరాతను కూడా గమనిస్తారు. కొట్టివేతలు లేకుండా ఆకర్షణీయంగా రాస్తే మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

–శిరీషారెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అబాకస్, వేదిక్ మాథ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ గంగప్ప



అద్వికను అభినందిస్తున్న హెచ్ఎం, కరస్పాండెంట్

హిందూపురం టౌన్: విశ్వం ఎడిటెక్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలోని స్థానిక ఆదిత్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయిలో పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని పెద్దగుడ్డంపల్లి ఉషోదయ పాఠశాల, పట్టణంలోని బాలాజీ ఉషోదయ పాఠశాల విద్యార్థులు చరణ్, మైత్రి అత్యంత ప్రతిభ కనబరిచారు. వేదిక్ మాథ్స్, వాల్యూం వన్, అబాకస్ జూనియర్ లెవెల్ వన్‌లో, జోనల్ స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయగా ఎంఈఓ గంగప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అబాకస్, వేదిక్ గణితం విద్యార్థులకు బోధించడం వల్ల గణితం కష్టమనే భావన ఉండదని, సులభంగా విద్యార్థులు నేర్చుకుంటారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయిరెడ్డి, ఏజీఎం రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శివరాం, పరిపాలన అధికారులు లక్ష్మీ, అరుణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి గణిత శాస్త్ర పోటీలకు అద్విక ఎంపిక

బత్తలపల్లి: మండల కేంద్రంలోని జ్యోతి హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అద్విక గణిత శాస్త్ర పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో అద్వికకు అభినందన సభ ఏర్పాటు చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విశ్వం ఎడ్యుకేషన్ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో పలు పాఠశాల విద్యార్థులకు అబాకస్, వేదిక్ మాథ్స్ జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ విద్యార్థిని అద్విక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కరస్పాండెంట్ ధర్మతేజ మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో రాణించగలిగితే మిగిలిన అన్ని సబ్జెక్టులు సులభరీతిలో నేర్చుకోవచ్చన్నారు.

విద్యతోనే బాలికలకు బంగారు భవిత



బుక్కపట్నంలో మాట్లాడుతున్న సీడీపీఓ గాయత్రి

పుట్టపర్తి: బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది విద్యనే అని వక్తలు పేర్కొన్నారు. సోమవారంబుక్కపట్నంలోని బాలుర ఉన్నతపాఠశాలలో 'కిశోరి వికాసం.. బాలబాలికలకు బంగారు భవిష్యత్తు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పుట్టపర్తి సీడీపీఓ గాయత్రి మాట్లాడారు. బాల్య వివాహాలు అరికట్టి.. చదువు కొనసాగించేందుకు మహిళా పోలీస్ కన్వీనర్‌గా కిశోరి బాలికల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కిశోర ఉజ్వల, ఆరోగ్యకరమైన సాధికారత దిశగా ముందుకు సాగే విధంగా తోడ్పాటునిద్దామని పేర్కొన్నారు. 11-18 ఏళ్ల బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వాలంబనను మెరుగు పరుచుకోవటానికి 'కిశోరి వికాసం' ఉపయోగపడుతోందన్నారు. బాలికల ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, హెచ్ఎం జగదీశ్వర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్య సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: బాలికలకు స్వీయరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమని సీడీపీఓ రాధిక, ఎంపీడీఓ అంజినప్ప పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, సీహెచ్ఓ నాగలక్ష్మి, ఎంఈఓ గోపాల్‌నాయక్, జీఎమ్ఎస్‌కే గీతాప్రియ, పీజీటీ శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, లక్ష్మీదేవి, మౌలాబి తదితరులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'తో బాలికల భవిష్యత్ మెరుగు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహనాయుడు

బత్తలపల్లి: బాలికల భవిష్యత్తు మెరుగుపరచడానికి 'కిశోరి వికాసం' మంచి అవకాశమని వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ బత్తలపల్లి ప్రాజెక్టులో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీఓ సరస్వతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులు, ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్, వెలుగు ఏపీఎం సుదర్శన్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'కిశోరి వికాసం' ముఖ్య ఉద్దేశం బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడమని పేర్కొన్నారు. గ్రామంలో జరిగే బాల్య వివాహాలు తగ్గించి వారిని చదువు దిశగా నడిపించడానికి ప్రతి గ్రామంలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా కిశోరి బాలికల కమిటీలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి పట్టాలివ్వండి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సర్వేనంబరు 83లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇలాఖత్, మధునాయక్, ఆదెప్ప, అంజి, వెంకటరమణ, లక్ష్మీదేవి, కవిత, నరసమ్మ, అరుణ, రెడ్డమ్మ, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

స్థలాలిచ్చి.. ఇళ్లు నిర్మించాలి

తాడిమర్రి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ముసుగు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, దాసు ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు అందజేసి, పక్కా గృహాల నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే పొలాలకు వెళ్లేందుకు రస్తాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశార. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుళ్లాయప్ప, సన్నపెద్దన్న, చౌడప్ప, రాముడు, వన్నూరప్ప, నాగభూషణం, సూరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఇంటి స్థలాలు లేని నిరుపేదలందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు మహదేవ, నాగరాజు, ముత్యాలు, అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సురేష్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టిస్తామని చెప్పిన చంద్రబాబు.. నేడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ఈరప్ప, శంకరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం శుభ్రం



ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. ఈ ప్రాంతంలో మందు సేవించి ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులను అక్కడే పడివేశారు. ఈ విషయంపై సోమవారం సాక్షి దినపత్రికలో 'మందుబాబులను అడ్డుకునే వారే లేరా' శీర్షికతో వార్త ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి వెంటనే స్పందించారు. పారిశుధ్య కార్మికులతో అక్కడ పడి ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపు పనులు చేపట్టారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



ఎంఈఓలతో కలసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కనగానపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చలపతి తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద సోమవారం ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవితో కలసి పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, పీఆర్‌టీయూ మండల నాయకులు చాంద్‌బాషా, శివశంకర్ రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ధర్మవరం నియోజకవర్గ ఓటర్లు 2,46,295

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా ప్రకారం 2,46,295 మంది ఓటర్లు ఉన్నారని ఆర్డీఓ మహేష్ తెలిపారు. తుది ఓటర్ల జాబితాను ఆర్డీఓ తన కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 295 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుష ఓటర్లు 1,22,028 మంది, మహిళా ఓటర్లు 1,24,247 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ: బూదనాంపల్లికి చెందిన రాజారెడ్డి అనే వ్యక్తి సోమవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని పొలంలోని విద్యుత్ తీగలు సరి చేస్తుండగా ఉన్నపళంగా విద్యుత్ సరఫరా అయ్యింది. షాక్‌కు గురై గాయపడిన రాజారెడ్డిని వెంటనే ముదిగుబ్బ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి

ఎన్పీకుంట: పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గూటిబైలు, ధనియానిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఎన్పీకుంటలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను ఎస్టీయూ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జవహర్, రామాంజులు యాదవ్, ప్రధానోపాధ్యాయులు శాంతమ్మ, బోగాదిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రెహానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిల్లర్ కిందపడి వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: కాంక్రీట్ మిల్లర్ కింద ప్రమాదవశాత్తూ పడిఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కమ్మవారిపల్లిలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇదే గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి అనే మూగ వ్యక్తి కాంక్రీట్ మిల్లర్ రన్నింగ్‌లో ఉండగా తొంగిచూడబోయి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని స్థానికులు బయటకు తీసి హుటాహుటిన కదిరిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి టౌన్: అఖిల గాండ్ల తెలిక సామాజిక వర్గం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల రాష్ట్ర సంఘం రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ సోమవారం గాండ్ల సంఘం ఆధ్వర్యంలో కదిరి సీనియర్ న్యాయవాది సీవీ కృష్ణమూర్తి, ఏజీటీయూపీఎస్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హరికుమార్ ఆవిష్కరించారు. ఉత్తమ అవార్డు పొందిన గాండ్ల ఉపాధ్యాయులు జి.సుమలత, కె.లావణ్యను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాండ్ల సంఘం నాయకులు కె.కృష్ణయ్య,హరి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, నాగరాజు, వెంకటప్రసాద్, రమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏపీటీఎఫ్, యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను సోమవారం ఆయా యూనియన్ల మండల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు మున్వర్‌బాషా, ప్రసూన్ కుమార్ నాయుడు ఆవిష్కరించారు.

రామానాయుడు సేవలు వెలకట్టలేనివి



రామానాయుడును అభినందిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఉపాధ్యాయుడు రామానాయుడు అందించిన సేవలు వెలకట్టలేనివని డీఈఓ కృష్ణప్ప పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రామానాయుడును సోమవారం ఎమ్మార్సీలో ఘనంగా సత్కరించారు. ఏపీసీ దేవరాజు, ఎస్ఎస్ఏ అధికారి ఆనంద్, ఎంఈఓలు ప్రసాద్ ఖాదర్వలి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి తదితరులు ఆయన్ను సన్మానించి, సేవలను కొనియాడారు.

జీతాలు వెంటనే చెల్లించండి

ఓడీచెరువు : పారిశుధ్య కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఈఓఆర్డీకి వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా పనిచేస్తున్న స్వచ్ఛ భారత్, క్లాప్ మిత్ర కార్మికులకు బకాయిపడిన తొమ్మిది నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం రూరల్: గొళ్లపల్లి వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ధర్మవరంలోని మార్కెట్ వీధికి చెందిన ఆంజనేయులు గాయపడ్డాడు. వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

కనగానపల్లి: రీ సర్వే ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్ తెలిపారు. భూముల రీ సర్వేపై సోమవారం కనగానపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పుట్టపర్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రాజు పేర్కొన్నారు. ఆయన సోమవారం రిటైర్డు ఉపాధ్యాయుడు చెన్న కృష్ణారెడ్డితో కలిసి బుక్కపట్నం మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. అనంతరం పర్యావరణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు అట్టలు, పెన్నులు బహుమతిగా అందించారు.